
ప్రజాశక్తి

ఆదివారం 27 అక్టోబర్ 2024 | 5 | శ్రీ సత్యసాయి



'అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తాం.. ప్రజలపై ఈ ప్రభుత్వం వేసిన భారాలను అన్నీ తగ్గించి అండగా ఉంటాం' అంటూ ఎన్నికల ముందుకు కూటమి నాయకులు ఇచ్చిన హామీ నీటిమూట అయ్యింది. ట్రూ అప్ పేరుతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై భారం వేసింది. అధికారంలోకి వచ్చిన మూన్నెళ్లకే విద్యుత్ ఛార్జీల పెంచి సామాన్య, మధ్య తరగతి కుటుంబాల నడ్డివిరిచింది. ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతం అవుతున్న ప్రజలకు విద్యుత్ ఛార్జీల భారం మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా తయారైంది. విద్యుత్ ఛార్జీలను పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజల నుంచి సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది.



ప్రజలకు కూటమి షాక్

- ట్రూ అప్ పేరుతో విద్యుత్‌ఛార్జీల భారం
- యూనిట్‌పై రూ.1.58 వరకు అదనం
- గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తున్న కూటమి
- ప్రభుత్వ తీరుపై వినియోగదారుల మండిపాటు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ పంపిణీ సంస్థలు వాటికయ్యే ఖర్చు, వస్తున్న ఆదాయం మధ్యనున్న వ్యత్యాసాన్ని పూడ్చుకునేందుకు అంటూ ట్రూఅప్ పేరుతో అదనపు ఛార్జీలను వసూలు చేస్తోంది. గత ప్రభుత్వం ఇదే విధానాలను అవలంభించింది. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి వీటిపై పెద్ద ఎత్తున విమర్శలు చేసింది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని హామీలు సైతం ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే ఆ హామీని తుంగలో తొక్కి ట్రూ అప్ పేరుతో పేదలపై భారం వేసింది. అనంతపురం జిల్లాలో 12.99 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో హెచ్‌టి సర్వీసులు (భారీ పరిశ్రమలు) 817 ఉన్నాయి. వీటి పరిధిలో గృహ వినియోగారులకు సంబంధించి ప్రస్తుతం ట్రూ ఆప్ పేరుతో విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వం ప్రజలపై వేసింది. ప్రస్తుతం యూనిట్‌కు రూ.1.58 పైసలు ప్రజలపై భారం పడనుంది. ప్రస్తుత నిబంధన ప్రకారం దాదాపు 18 నెలల పాటు దీనిని వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు. ఉదాహరణకు నెలకు 30 యూనిట్లకన్నా తక్కువగా వాడేవారు ఇప్పుడు యూనిట్‌కు రూ.1.90 పైసల చొప్పున చెల్లిస్తుండగా ఇకపై రూ.2.73 పైసల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి వారిపై దాదాపు 44 శాతం అదనపు విద్యుత్ భారం పడనుంది.

ప్రజల మండిపాటు

విద్యుత్ ఛార్జీల పెంపుపై ప్రజల నుంచి సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పి ఇప్పుడు ట్రు అప్ భారాలు వేయడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీల నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలంటూ ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపట్టి నిరసన తెలిపారు. భవిష్యత్తులో కూడా వీటిపై ప్రజలతో కలిసి పోరాటం చేస్తామంటూ ఆ పార్టీ తెలియజేసింది. ధరాభారాలతో సతమతం అవుతుంటే ప్రభుత్వం ట్రూ అప్ పేరుతో విద్యుత్ ఛార్జీల రూపంలో మరో భారాన్ని మోపడంపై సామాన్యుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసహరించుకోవానే డిమాండ్ ప్రజలందరి నుంచి వ్యక్తం అవుతోంది.

విద్యుత్ ఛార్జీల పెంపు అన్యాయం

విద్యుత్ ఛార్జీల పెంపు అన్యాయం. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలను పెంచమంటూ హామీ ఇచ్చారు. ఇప్పుడు మూడు నెలలకే పెంచేశారు. విద్యుత్‌పైనే నెలకు రూ.150 నుంచి రూ.200 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. అసలే భారాలతో కుటుంబ జీవనం కష్టంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అండగా నిలవాల్సింది పోయి, భారం వేయడం సరికాదు. గత కొన్నేళ్లుగా ఏదో ఒక రూపంలో ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ భారాలను మోపుతున్నాయి. ఈ భారం ఒక నెలతో పోయిది కాదు. ప్రతి నెలా అదనపు బాదుడు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలి.

ప్రశాంత్‌కుమార్, పుట్టపర్తి.

ప్రమాదంలో మృతి చెందిన వారు




ప్రణవ్‌సాయి రెడ్డి



ప్రసన్నకుమార్ రెడ్డి



సంతోష్ కుమార్



బొట్ట షన్ముఖ



బలగొండ శ్రీనివాసులు



వెంకటేశులు

సంకీర్తనలు విన్పిస్తూ అందులో నిత్యం ఊలలాడే వారిని మృత్యువు వెంటాడింది. ఎంతో సంతోషంగా సంకీర్తనలు చేసి తిరిగొస్తున్న వారికి అదే చివరి ప్రయాణం అయ్యింది. రాత్రంతా కీర్తనలు పాడి అలసిపోయి కారులో కునుకు తీసిన వారు అలాగే మృత్యునిద్రలోకి జారుకున్నారు. అనుకోని ప్రమాదంతో వారి జీవితాలు అర్ధాంతరంగా ముగిశాయి. శనివారం సాయంత్రం అనంతపురం జిల్లా నాయనపల్లి క్రాస్ వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారంతా అనంతపురం జిల్లా కేంద్రంలోని ఇస్కాన్ టెంపుల్‌కు సంబంధించిన సభ్యులు. తాడిపత్రిలో సంకీర్తనలు ముగించిన అనంతపురానికి కారులో తిరిగొస్తుండగా నాయనపల్లి క్రాస్ వద్ద ఈ ఘటన చోటు శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...



ఘటనా స్థలంలో లారీ కిందకు దూసుకుపోయి న కారు

మృత్యు 'సంకీర్తన'

- నాయనపల్లిక్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- లారీని ఢీకొన్న కారు
- ఆరుగురు దుర్మరణం
- మృతులంతా అనంత ఇస్కాన్ సభ్యులు
- తాడిపత్రిలో సంకీర్తనలు ముగించుకుని వస్తుండగా ఘటన

ప్రజాశక్తి-శింగనమల, అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ఇస్కాన్ ఆలయంలో అనంతపురానికి చెందిన మందల సంతోష్ కుమార్(34), గిల్లి వెంకటేష్ (20), యాగంటి లక్ష్మి ప్రసన్నకుమార్ రెడ్డి (29), కర్న ప్రణీత్ ప్రణవ్‌సాయి రెడ్డి (14), శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం హరియాన్ చెరువు గ్రామానికి చెందిన బలగొండ శ్రీనివాసులు(34), శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పెద్దపల్లికి చెందిన బొట్ట షన్ముఖ(21)లు ఉన్నారు. వీరు ఇస్కాన్ ఆలయంలో భక్తులుగా ఉంటూ వివిధ ప్రాంతాల్లోని ఆలయాల్లో సంకీర్తనలు చేసేందుకు వెళ్తుంటారు. అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం అనంతపురం జిల్లా తాడిపత్రిలోని ఓ ఆలయంలో సంకీర్తనలు చేసేందుకు వెళ్లారు. అక్కడ సంకీర్తనలు చేసి ఆరోజు రాత్రి అక్కడే ఉన్నారు. శనివారం మధ్యాహ్నం కారులో తాడిపత్రి నుంచి అనంతపురంలో ఆరుగురు బయల్దేరారు. కారు శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్దకు రాగానే టైర్ పేలింది. దీంతో అదుపు తప్పి ఎదురుగా అనంతపురం నుంచి బియ్యం లోడుతో వెళ్తున్న లారీని ఢీకొంది. లారీ, కారు వేగంగా ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ఉన్న ఆరుగురూ అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. లారీ కిందకు కారు దూసుకుపోవడంతో నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ఆరుగురూ ఇరుక్కుపోయారు. అటుగా వెళ్తున్న వారు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ కింద ఇరుక్కుపోయిన కారును అతికష్టం మీద బయటకు తీశారు. కారు తలుపులను బలవంతంగా తెరిచారు. అప్పటికే కారులో ఉన్న ఆరుగురూ తీవ్ర గాయాలతో మరణించారు. మరణించిన వారి వద్ద ఉన్న గుర్తింపు కార్డుల ఆధారంగా వారంతా అనంతపురం ఇస్కాన్ ఆలయానికి సంబంధించిన వారుగా గుర్తించారు. వెంటనే ఇస్కాన్ నిర్వాహకులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు శింగనమల సిఐ కౌరుట్లయ్య తెలిపారు.

ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

నాయనపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడదల చేశారు. సంకీర్తనలకు వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదంలో అరుగురు మరణించడం విచాకరం అన్నారు. మతుల బంధువులకు ఎమ్మెల్యే ఫోన్ చేసి మాట్లాడి సానుభూతినీ వ్యక్తం చేశారు.



వెనిజులా ఉపాధ్యక్షురాలుకు స్వాగతం పలుకుతున్న అదనపు ఎస్పీ

పుట్టపర్తికి వెనిజులా ఉపాధ్యక్షురాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వెనిజులా ఉపాధ్యక్షురాలు రోడ్‌రిడ్జ్ డెల్సీ విచ్చేశారు. సత్యసాయి బాబా మహా సమాధి దర్శనార్థం ఆమె తన బృందంతో కలిసి ప్రత్యేక విమానంలో పుట్టపర్తికి వచ్చారు. వారి బందానికి విమానాశ్రయంలో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, శ్రీ సత్యసాయి జిల్లా అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, ఎఆర్‌డి ఎస్‌పి జెడ్.విజయ్‌కుమార్‌లు వారికి స్వాగతం పలికి పుష్పగుచ్ఛలు అందజేశారు. విమానాశ్రయం నుండి వారు నేరుగా పుట్టపర్తి ప్రశాంత నిలయం చేరుకున్నారు.

నవంబర్‌లో నైపుణ్య గణన సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో నైపుణ్య గణన (స్కిల్‌సెన్సస్)ను నవంబర్ మొదటి వారంలో ప్రారంభించనున్నారని కలెక్టర్ టిఎస్.చేతన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం జిల్లాస్థాయి శిక్షణను పుట్టపర్తిలోని పీడీ, డిఆర్‌డిఎ ఆఫీస్, సమావేశ మందిరంలో సచివాలయ ఉద్యోగులకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల స్థాయిలో మున్సిపల్ పట్టణాల్లో శిక్షణలను ఎంపీడీవో, మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్వేలో 15 నుంచి 59 సంవత్సరాలు వయసు గల వారి వివరాలను సమగ్రంగా తీసుకోవాలన్నారు. నైపుణ్య గణన ద్వారా జిల్లాలోని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగు పరచటానికి వీలవుతుందన్నారు. ఆధార్ ఆధారిత ఒటిపి, బయోమెట్రిక్ ద్వారా యానిమరేటర్లు వివరాలను సేకరిస్తారని చెప్పారు. సర్వేకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సచివాలయ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

ప్రజాశక్తి-హిందూపురం

సంతేబిదనూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యురాలు అనురాధ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

టపాసుల విక్రయాల్లో

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


ప్రజాశక్తి-హిందూపురం

టపాసుల వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ వెంకటేశు, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు హెచ్చరించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని పట్టణంలో టపాసుల విక్రయానికి దరఖాస్తు చేసుకున్న 56 మందితో శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు, అగ్నిమాపక అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు చట్ట విరుద్ధంగా అనుమతులు లేకుండా టపాసులు విక్రయించరాదన్నారు. అనుమతులు పొందిన దుకాణాదారులు వారి దుకణాల వద్ద తప్పనిసరిగ నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. నివాసాల వద్ద ఎవరైనా టపాసులు విక్రయిస్తుంటే 100, 112కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. పట్టణంలోని ఎంజిఎం పాఠశాల మైదానంలో విక్రయానికి స్థలం ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో ఆర్ఐ అమరేంద్ర, రెవిన్యూ, మున్సిపల్ అధికారులు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశు

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం : సిపిఎం



సిపిఎం మహాసభలో పాల్గొన్న కార్మిక నేతలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఎన్నికల హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న, దిల్షాద్ విమర్శిం చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సిపిఎం శాఖ మహాసభ నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ ఆదినారాయణ జెండాను ఆవిష్కరించగా పెద్దన్న, దిల్షాద్ రాజకీయ రిపోర్టును ప్రవేశపెట్టారు. వారు మాట్లాడుతూ వర్షాలకు నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. స్కీం, మున్సిపాలిటీ, తదితర కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మారిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక విధానాల్లో చాలా లోపాలు ఉన్నాయ న్నారు. గంజాయి, మద్యం విపరీతంగా అమ్మడం వల్ల వేధింపులు, హింస పెరిగిపోతా యన్నారు. రానున్న రోజుల్లో సూపర్‌సిక్స్ వాగ్దానాల అమలు, విద్యుత్ ఛార్జీల భారాలపై సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చివరలో శాఖ కార్యదర్శి, జిల్లా మహాసభ ప్రతినిధులను ఎన్నుకు న్నారు. కార్యక్రమంలో మారుతి, ఎస్‌హెచ్ బాషా, అయూబ్‌ఖాన్, ఆదినా రాయణ, హరి, నాగార్జున పాల్గొన్నారు.

వైద్యసేవలను నిర్లక్ష్యం చేయొద్దు

ఎన్టీఆర్ వైద్య సేవలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి - కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా అసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ టిఎస్.చేతన్ వైద్యాధికారులకు సూచించారు. శనివారం జిల్లా అసుపత్రిలో కలెక్టర్ అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అసుపత్రుల కో ఆర్డినేటర్ తిప్పేంద్ర నాయక్, హిందూపురం జిల్లా ఆసుపత్రి సూపరిటెండెంట్ లింగన్న, హిందూపురం మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, ఆర్ఎంఒ డేవిడ్, కమిటీ సభ్యులు విద్యాసాగర్, శ్రీదేవి, లక్ష్మీనరసింహ, ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, పెనుగొండ ఆర్డీవో ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు. 15 అంశాలతో కూడిన అజెండాపై చర్చించి, అమోదం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెడికల్ సూపరిటెండెంట్, ఆర్ఎంఒలు ఆసుపత్రిలోని ప్రతి వార్డునూ క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర చికిత్స విభాగంలో వైద్యులు, వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని తెలిపారు. ఆసుపత్రిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎన్టీఆర్ వైద్య సేవలను విస్తృత పరచాలన్నారు. శిశు, మాత మరణాలు సంభవించకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలియజేశారు. చిన్నచిన్న జబ్బులకే అనవసరమైన రెఫర్‌లను చేయకుండా స్థానికంగా చికిత్సలు అందించాలన్నారు. నూతనంగా నిర్మాణం చేస్తున్న క్రిటికల్ కేర్ బ్లాక్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, వచ్చే నెలకు అందుబాటులోకి తేవాలన్నారు. వైద్యులు సాయంత్రం నాలుగు గంటల వరకు కచ్చితంగా విధుల్లో ఉండాలన్నారు. అనంతరం కలెక్టర్ అసుపత్రిని పరిశీలించి, రోగులతో మాట్లాడారు. ఈ సమావేశంలో వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్

చౌళూరు పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపూరం రూరల్ పరిధిలోని చౌళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారిణి మంజువాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలియ తిరిగి కాన్పుల వార్డు, రోగుల వార్డు. ల్యాబ్ రూమ్‌లను క్షుణంగా పరిశీలించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టిక, ఓపి వివరాలను చూశారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ వాటి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు బివి.చంద్రశేఖర్, శాంతకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రిలోని పరీక్షల విభాగాన్ని పరిశీలన చేస్తున్న జిల్లా వైద్యాధికారిణి మంజువాణి



. సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ సరస్వతి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

సచివాలయ సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి, ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ సరస్వతి సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. శనివారం రూరల్ మండల పరిధిలోని కిరికెర 1, 2, 3 సచివాయాలను ఆకస్మిక తనఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారు, ఎంత మంది హాజరు అయ్యారు తదితర వివరాలను పంచాయతీ సెక్రటరీతో అడిగి తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు తప్పని సరిగ సమయ పాలన పాటించాలన్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ హాజరు వేయాలని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపాలన్నారు.



టిడిపి సభ్యత్వ నమోదు పత్రాలను చూపుతున్న ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, టిడిపి నాయకులు

టిడిపి బడుగు, బలహీన వర్గాల పార్టీ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరిటౌన్

తెలుగుదేశం పార్టీ బడుగు, బలహీన వర్గాల కోసం ఆవిర్భవించిన పార్టీ అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా శనివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఎమ్మెల్యే ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తన సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. టిడిపిలో కార్యకర్త నుంచి నాయకుడు, ఎమ్మెల్యే వరకూ ప్రతిఒక్కరూ సమనమే అన్నారు. తొలి నుంచి కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, పార్టీని నడిపించేది కార్యకర్తలే అన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ నుంచి ఎమ్మెల్యే టిడిపి సభ్యత్వం రెన్యువల్ కార్డు అందుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వహీద్ హుస్సేన్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పివి. పవన్‌కుమార్‌రెడ్డి, పర్వీన్‌బాను, కౌన్సిలర్ బహుద్దీన్, ఫయాజ్ పాల్గొన్నారు.

సభ్య సమాజం తలదించుకునేలా జగన్ తీరు : ఎమ్మెల్యే

కుటుంబంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించలేని వ్యక్తి రాష్ట్రాన్ని, ప్రజలను ఎలా కాపాడు తారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాజీ సిఎం జగన్, వైసిపి నాయకులను ప్రశ్నించారు. పట్టణంలోని తన నివాసంలో కందికుంట మీడియాతో మాట్లాడుతూ జగన్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అరెస్టు అవుతారన్న విషయం జగన్‌కు స్పష్టంగా తెలుసు కాబట్టే ఇతరులపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. తల్లి, చెల్లి కంట నీరు పెట్టిస్తూ జగన్ వ్యవహరిస్తున్న తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. గతంలో జగన్‌ను నమ్మి ప్రజలు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నిండా ముంచేశాడన్నారు. జగన్ వ్యవహార శైలిని ప్రజలంతా తప్పుపడుతున్నారన్నారు. జగన్ అండ్ కోటరీ మాట్లాడే మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. జగన్ వ్యవహారి శైలి నచ్చకనే ప్రజలు వైసిపిని 11 సీట్లకు పరిమితం చేశారని గుర్తుచేశారు.

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కరపత్రం ఆవిష్కరణ

పట్టణంలో నవంబర్ 10వ తేదీ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఖాద్రీ వడ్డెర సంఘం గౌరవాధ్యక్షులు సైదాపురం రమణ, అధ్యక్షులు డాబా గంగయ్య, ఉపాధ్యక్షులు నరసింహులు, కోశాధికారి చల్లా చంద్రశేఖర్ బాబు, సభ్యుడు చిన్నఖాదర్, వెంకటరమణ, నారాయణ, ప్రసాద్,పెద్ద వేమయ్య, పాల్గొన్నారు.



డ్రెయినేజీలను పరిశీస్తున్న పరిటాల శ్రీరామ్

డ్రెయినేజీ సమస్యలను పరిష్కరిస్తాం : పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలో డ్రెయినేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. పరిటాల శ్రీరామ్ శనివారం మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ముందుగా గాంధీనగర్ లో పర్యటించగా కబరస్థాన్‌లో వర్షం నీరు పెద్దఎత్తున నిల్వ ఉండటాన్ని గమనించారు. చిన్నపాటి వర్షం కురిసినా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు మైనార్టీలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం శ్రీదేవి థియేటర్, గాంధీనగర్‌లో డ్రెయినేజీలను పరిశీలించారు. వర్షం కురిసిన ప్రతిసారీ మోకాలి లోతు నీరు చేరుతోందని స్థానికులు వాపోయారు. స్పందించిన శ్రీరామ్ ఆయా సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపేందుకు అధికారులతో చర్చిస్తామని తెలిపారు. ఇటీవల ధర్మవరం సిఐ నాగేంద్రప్రసాద్ తల్లి హత్యకు గురైన నేపథ్యంలో శ్రీరామ్ సిఐని పరామర్శించారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారులు

పంటల బీమాపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రబీ సీజన్‌లో వరి, వేరుశెనగ, టమోటా పంటలకు సంబంధించి 2024-25 సంవత్సరానికి రైతులతో పంట బీమా చేయించాలని వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు సూచించారు. వరికి డిసెంబర్ ఆఖరి లోపు, వేరుశెనగ, టమోటాలకు డిసెంబరు 15వ తేదీ లోపు బీమా చేయించాలన్నారు. ఆయన శనివారం జిల్లావ్యాప్తంగా సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, గణాంక శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంటల బీమా పథకం, ప్రీమియం వివరాలు, కట్టే విధానం, ఇన్సూరెన్స్ అమలు చేసే కంపెనీల గురించి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి విజయకుమార్, ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు .

పూలకుంట సచివాలయం తనిఖీ

నల్లచెరువు-ప్రజాశక్తి

మండలంలోని కదిరి పూలకుంట సచివాలయాన్ని శనివారం ఎంపిడిఒ రఘునాథగుప్తా సందర్శించారు. ఆయన సచివాలయ సిబ్బంది పనితీరుపై శాఖల వారీగా ఆరా తీశారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. గ్రామాల్లో ఫీవర్ కేసులు ఉన్నాయని నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. జ్వర పీడితులకు వైద్య సిబ్బంది చికిత్స అందించాలన్నారు. బయోమెట్రిక్ నిబంధనలు పాటించాలని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని, విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీపై పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి విశ్వేశ్వర ఉన్నారు.

పోలీస్ సిబ్బందికి పోటీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో పోలీసుల చర్యలు, సైబర్ క్రైమ్ నేరాలు-నియంత్రణలో యువత పాత్ర అంశాలపై ఈ పోటీలు నిర్వహించారు. ఎఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పర్యవేక్షణలో ప్రభుత్వ ఉపాధ్యాయుల సమక్షంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్‌ఐలు వలి, మహేష్, సైబర్ సెల్ సిఐ తిమ్మారెడ్డి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, ఆర్‌ఎస్‌ఐలు, వెంకటేశ్వర్లు, ప్రదీప్ సింగ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీలకు హాజరైన పోలీసు సిబ్బంది

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 23 ఏళ్లుగా 85 వేల మంది కార్మికులు మధ్యాహ్నం భోజనం పథకంలో పని చేస్తున్నారన్నారు. వారందరూ అట్టడుగు వర్గాలకు చెందినవారే అన్నారు. రోజుకు సుమారు 8 గంటలు పని చేస్తున్నా నెలకు రూ. 3 వేలు గౌరవ వేతనం ఇస్తూ వెట్టి చాకిరీ చేయించడం తగదన్నారు. తక్షణమే గౌరవ వేతనం పెంచాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాలన్నారు. అలాగే విద్యార్థికి రూ. 20 చొప్పున మెనూ ఛార్జీలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంపు, 9, 10 తరగతుల విద్యార్థులకు భోజనం వండి పెట్టే వర్కర్లకు వేతనాలు, బిల్లులు, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, ప్రమాద బీమా వర్తింపజేయాలని కోరారు. తాగునీరు, గ్యాస్ పంపిణీ, వంట షెడ్డు, గ్యాస్ స్టవ్, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ప్రభుత్వమే ఏర్పాటు చేయాలన్నారు. వంట చేసేటప్పుడు ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం ఇవ్వాలని, ప్రయివేటు సంస్థలకు అప్పగించరాదని, ఏడాదికి రెండు జతలు యూనిఫారం, 2 నెలలకు ఓ సారి వర్కర్లతో ఎంఇఒలకు సమావేశాలు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, నాయకులు రాజురావు, ఆటో నాగప్ప, తిప్పన్న పాల్గొన్నారు.



తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

టిడిపి సభ్యత్వ నమోదుతో కార్యకర్తకు భరోసా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

సభ్యత్వ నమోదులో మడకశిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని బాలాజీ నగర్ టిడిపి కార్యాలయంలో శనివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ముందుగా వారు టిడిపి పట్టణ కన్వీనర్ మనోహర్ మృతికి సంతాపం తెలిపారు. వారు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యకర్తకు భరోసా అన్నారు. నియోజక వర్గంలోని టిడిపి కుటుంబ సభ్యులందరూ సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులందరూ కలిసి సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయ వంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కుంచితి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వివిఎం. పాండురంగప్ప, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి గుండుమల రాధాకృష్ణ, అమరాపురం ప్రసాద్, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, రొళ్ల జిఎస్ యోగానంద్, కొత్తపాలెం రవికుమార్, కార్యదర్శులు, ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు, చిత్రంలో గుండుమల, శ్రీనివాసమూర్తి

మడకశిరకు జాతీయ రహదారి మంజూరు

సిఎం చంద్రబాబు చొరవతో నియోజకవర్గంలో జాతీయ రహదారికి మోక్షం లభించినట్లు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి తెలిపారు. వారు శనివారం పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే జాతీయ రహదారి అధికారులు కర్నాటకలోని హిరియూరు నుంచి మడకశిర మీదుగా పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి వరకూ సర్వే చేసి కేంద్రానికి నివేదిక పంపించారన్నారు. త్వరలోనే కేంద్ర మంత్రిని కలిసి జాతీయ రహదారి పనులు ప్రారంభించేలా చూస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలను కలిపేలా ఈ జాతీయ రహదారి ఏర్పాటవుతుందన్నారు. ఈ రహదారి ఏర్పాటుతో నియోజకవర్గానికి అనేక పరిశ్రమలు రావడంతో పాటు, ఆంధ్ర, కర్నాటకలోని పెద్ద పెద్ద పట్టణాలకు వాణిజ్య రవాణాకు కేంద్ర బిందువుగా మారుతుందని తెలిపారు.

మనోహర్ కుటుంబానికి ఎమ్మెల్యే సతీమణి పరామర్శ

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సతీమణి ఉమాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పట్టణ టిడిపి అధ్యక్షుడు మనోహర్ ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పిల్లల చదువులు, కుటుంబ యోగక్షేమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

195 చెరువులకు నీళ్లిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

నియోజకవర్గంలోని 195 చెరువులకు నీళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని నాలుగేళ్లలో పూర్తి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. వారు శనివారం ఓబుళదేవరచెరువులో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సభ్యత్వం తీసుకుంటే కార్యకర్తల కుటుంబాలకు కొండంత భరోసా ఉంటుందని తెలిపారు. పార్టీలో, పదవులు వస్తాయన్నారు. అలాగే పలు ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అత్యధిక సభ్యత్వాలు చేసి రాష్ట్రంలోనే అగ్రభాగంలో నిలిపేలా పని చేద్దామని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ప్రాధాన్యతా క్రమంలో అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కె. జయచంద్ర, మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్‌రెడ్డి, నాయకులు రాజారెడ్డి, బొడ్డు జయన్న, తుమ్మల మహబూబ్ బాషా, పీట్ల సుధాకర్, బోయపల్లి శివారెడ్డి, మల్లాపల్లి ఓబుల్‌రెడ్డి, అంజనప్ప, నల్లగుట్లపల్లి సర్పంచి శంకర్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీనివాసులు, షాను, ఆరిఫ్‌ఖాన్, సౌదీ నాగరాజు, నిజాం, అంజన్‌రెడ్డి, సునీల్, లక్ష్మీదేవి, నాగేంద్ర, రేణుకాబాయి పాల్గొన్నారు.



టిడిపి సభ్యత్వ నమోదు పత్రాలను చూపుతున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, టిడిపి నాయకులు

మామిడి మొక్కలు పంపిణీ

మండలంలోని వెంకటాపురం, చింతమానిపల్లి, కొండకమర్ల పంచాయతీ లకు చెందిన 11 మంది రైతులకు ఎమ్మెల్యే సింధూరరెడ్డి మామిడి మొక్కలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ ద్వారా రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు అందిస్తోందన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ అనంతాచారి, ఎంపిడిఒ విల్సన్ రాబర్ట్, టిడిపి నాయకులు జయచంద్ర, పిట్టా ఓబుల్‌రెడ్డి, డ్వామా ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప, ఫీల్డ్ అసిస్టెంట్స్ ఉత్తప్ప, సుబ్బిరెడ్డి, శివారెడ్డి, షాను, ఆరిఫ్‌ఖాన్, శంకర్‌రెడ్డి, నిజాం, శ్రీనివాసులు, సౌదీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : పల్లె

బుక్కపట్నం : పార్టీ కార్యకర్తలకు ఎల్లపుడూ అండగా ఉంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. కార్యకర్తల త్యాగాలు మరువలేనివన్నారు. ఉపిరి ఉన్నంత వరకూ పార్టీకి సేవ చేస్తానని తెలిపారు. టిడిపి మహిళా కార్యకర్త ఫాతిమా మరణించడంతో వారింటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండలంలోని నిడిమామిడి గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన రామాంజనేయులు కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వారు శనివారం నిడిమామిడి గ్రామం వెళ్లి రామాంజనేయులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతని భార్య, కుమార్తెలను పరామర్శించారు. వారి వెంట నాయకులు విజయ్‌కుమార్, బుగ్గపల్లి లాయర్ సుభాష్, నాగరాజు, ఎం.నరసింహులు, రామ్మోహన్, రామాంజనేయులు ఉన్నారు.

కూలీలతో వెళ్తున్న కారు, ఆటో ఢీ

ఒకరు మృతి.. 10 మందికి గాయాలు

ప్రజాశక్తి-యాడికి

కూలీలతో వెళ్తున్న ఓ ఆటోను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 10 మంది కూలీలు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... యాడికి మండలం కొట్టాలపల్లి నుంచి వేరుశనగ కట్టెను తొలగించడానికి డీజిల్ ఆటోలో 12 మంది కూలీలు బయల్దేరారు. ఆటో వేమలపాడు ప్రధాన రహదారిపైకి వెళ్లగానే తాడిపత్రి నుంచి గుత్తికి వెళ్తున్న ఓ కారు ఢీకొంది. ఆటో పల్టీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న వారంతా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న స్థానికులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొట్టాలపల్లి గ్రామానికి చెందిన దస్తగిరమ్మ(52)ను చికిత్స నిమిత్తం అనంతపురం తరలిస్తుండగా మార్గ మధ్యంలో మరణించింది. మిగిలిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని యాడికి పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




ప్రమాదంలో గాయపడిన కూలీలు

మెప్మా జిల్లా అర్బన్ సమాఖ్య ఏర్పాటు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలోని ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో శనివారం జిల్లా నూతన అర్బన్ సమాఖ్య ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మెప్మా పిడి విశ్వజ్యోతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అలాగే మెప్మా పట్టణ సమాఖ్యల పనితీరు, మెప్మా కార్యక్రమాలపై అవగహన కల్పించా రు. అధ్యక్షురాలిగా కె.విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాళ్లుగా సిరీన్, కార్యదర్శిగా యు.పద్మావతి, సహాయ కార్యదర్శిగా పద్మావతి, కోశాధికారిగా ఎం.కాంతమ్మను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు తమ ఎంపికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్నికైన నూతన సమాఖ్య సభ్యులు

ఎంజెపి ప్రిన్సిపల్‌గా అనిత బాధ్యతల స్వీకరణ

రొద్దం : స్థానిక ఎంజెపి పాఠశాలలో గత సెప్టెంబర్‌లో గోరంట్ల పాఠశాల నుంచి వచ్చిన అనిత ఎఫ్‌ఎసి ప్రిన్సిపల్‌గా విధులు చేపట్టారు. ఆమె ఉద్యోగోన్నతి పొంది శనివారం పూర్తిస్థాయి ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా కన్వీనర్ రమాదేవి, కో కన్వీనర్ సాగర్, పాఠశాల సిబ్బంది అభినందించారు.



ప్రిన్సిపల్ అనితను సన్మానిస్తున్న సిబ్బంది

కేంద్రం సంప్రదింపుల కమిటీలో ఎంపి బికెకు చోటు

పెనుకొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన సంప్రదింపుల కమిటీలో ఎంపి బికె.పార్థసారధికి రహదారులు, రవాణా శాఖలో సభ్యులుగా చోటు కల్పించారు. ఎంపి మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కి ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై ఎంపి దిగ్భ్రాంతి

అనంతపురంజిల్లాలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఎంపి బికె.పార్థసారధి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒకే ప్రమాదంలో ఇస్కాన్‌కు చెందిన ఆరుగురు మృతి చెందడం బాధాకరమన్నారు.

28న ప్రజాదర్బార్

గోరంట్ల : పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఈ నెల 28వ తేదీ ప్రజాదర్బార్ నిర్వహిస్తామని తహశీల్దార్ మారుతి తెలిపారు. కార్యక్రమానికి మంత్రి సవిత హాజరవుతారన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని తెలిపారు.

పాలకుల శాపం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా మారింది. అనంతపురం జిల్లా పరిస్థితి. ఒకవైపు ప్రధాన ప్రాజెక్టులన్నీ నాలుగైదుసార్లు నిండి పొర్లుతున్నా అనంతపురం జిల్లాలోని ప్రాజెక్టుల్లో మాత్రం నీరు అంతంత మాత్రంగానే ఉండటం గమనార్హం. ఆగస్టు, అక్టోబర్ మాసాల్లో పడిన వర్షాన్ని కూడా ఒడిసి పట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి పాలకుల శాపమే కారణమన్న విమర్శలున్నాయి. సాగు,తాగునీటిని అందించే రెండు ప్రాజెక్టులు జిల్లాకు ఉన్నాయి. అటు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, రెండు హంద్రీనీవా. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు తుంగభద్ర డ్యామ్ నుంచి నీళ్లు వస్తుండగా, హంద్రీనీవాకు శ్రీశైలం డ్యామ్ నుంచి వస్తాయి. తుంగభద్ర డ్యామ్ గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి నీళ్లొచ్చాయి. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు తుంగభద్ర డ్యామ్‌కు వచ్చిన నీళ్లు 451 టిఎంసిలు. అయితే ఇందులో జిల్లాకు ఇప్పటి వరకు వచ్చిన నీళ్లు 13 టిఎంసిలు మాత్రమే. ఐదుసార్లు గేట్లు ఎత్తి దిగువకు నీళ్లు వదిలినా కూడా అనంతపురం జిల్లాకు అదనంగా ఒక్క చుక్క నీళ్లు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలోనున్న ప్రధాన ప్రాజెక్టులు పిఎబిఆర్, మిడ్‌పెన్నార్‌లో నామమాత్రంగానే నీళ్లు ఉన్నాయి. పిఎబిఆర్‌లో రెండు టిఎంసిలు, మిడ్‌పెన్నారలో రెండు టిఎంసిల్లోపే నీళ్లు ఉన్నాయి. వృధాగా నీళ్లు నదిలో పోతున్న సమయంలోనూ అదనంగా జిల్లాకు నీళ్లు తీసుకోలేని దయనీయ స్థితి ఉంది. కనీసం తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యం మేరకు కూడా నీళ్లు జిల్లాకు తీసుకోలేకపోతున్నాయి. దీని ప్రవాహ సామర్థ్యం 2400 క్యూసెక్కులైతే 1800 క్యూసెక్కులకు మించి జిల్లాకు నీళ్లు తీసుకోలేకపోతున్నాం. దీనికి ప్రధాన కారణంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నిర్వహణ లోపాలే. ఆధునీకరణను 2008లో చేపడితే ఇప్పటికీ పూర్తవలేదు. కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో గండ్లు పడతాయన్న ఉద్దేశంతో పూర్తి సామర్థ్యంతో నీళ్లు తీసుకోలేకపోతున్నాం. ఇక హంద్రీనీవా పరిస్థితి అదే రకంగా ఉంది. శ్రీశైలం డ్యామ్‌లో పుష్కలంగా నీరున్నా ప్రవాహ సామర్థ్యం లేనందున నామమాత్రంగానే నీళ్లు వస్తున్నాయి. కనీసం జిల్లాలో పడుతున్న వర్షాలైనా ఒడిసి పట్టుకోగలుగుతున్నామా అంటే అదీ లేదు. చెరువుల్లోకి నీరొచ్చిన వెంటనే ఎక్కడికక్కడ గండ్లు పడుతున్నాయి. అనంతపురం జిల్లాలో 304 చెరువులున్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు పూర్తి సామర్థ్యంతో నిండినవి 34 మాత్రమే ఉన్నాయి. 171 చెరువుల్లో ఒక చుక్కనీరు లేదు. తక్కిన వాటిల్లో అరకొరగా నీళ్లు ఉన్నాయి. నీళ్లు వచ్చిన వెంటనే ఎక్కడివక్కడ తెగిపోతున్నాయి. అదే ఈనెలలో సత్యసాయి జిల్లా కనగానపల్లిలో వర్షాలు అధికంగా పడితే నీళ్లు దిగువకు వచ్చి బండమీదపల్లి చెరువు తెగింది. ఈ చెరువు తెగిన ప్రభావంతో అనంతపురం నగరంలోని పండమేరు వంక ఉధృతంగా ప్రవహించి కాలనీలను ముంచేసింది. ఇదే కాకుండా బొమ్మనహళ్, కణేకల్, గుమ్మగట్ట మండలాల్లోనే చెరువులకు గండ్లుపడిన దాఖలాలున్నాయి. ఇలా చెరువుల్లో నీళ్లు నిలుపుకోలేని పరిస్థితులున్నాయి. ఈ సమస్యలపైనే సిపిఎం గత వారంలో బస్సు యాత్ర చేపట్టి ఈ వారంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా కూడా నిర్వహించింది. వివిధ ప్రజా సంఘాలు, మేధావులు కూడా అనంతపురం జిల్లా సాగునీటి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచిస్తున్నాయి. అయినా పాలకుల్లో కదలిక కనిపించడం లేదు. ప్రధాన రాజకీయపార్టీలేవి ఈ సమస్యలపై దృష్టి సారిస్తున్న దాఖలాలు కూడా కనిపించకపోవడం గమనార్హం. నష్టం జరిగితే పరిశీలించడం మినహా శాశ్వత పరిష్కార మార్గాలపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలున్నాయి.



నేరాలు ఘోరాలు

ఉరేసుకొని వృద్ధుడు ఆత్మహత్య

చిలమత్తూరు : మండలంలోని కోడూరుకి చెందిన గోరంట్ల రంగప్ప(60) శనివారం కోడూరు జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి కుమార్తె చిలమత్తూరులో ఉంటుంది. రంగప్ప శుక్రవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. శనివారం కోడూరు జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉరి వేసుకొన్నాడు. రంగప్ప కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడని తెలిసింది. ఒంటరి తనంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని కృష్ణాపురం గేటు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. గుంతకల్లు నివాసులైన లింగన్న, ఎర్రిస్వామి మండలంలోని కన్నెకలగొంది గ్రామంలో బేల్దారి పని ముగించుకుని సాయంత్రం ద్విచక్ర వాహనంపై ముదిగుబ్బకు బయల్దేరారు. మార్గమధ్యలో కృష్ణాపురం గేటు వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్పందించిన గ్రామస్తులు అక్కడికి చేరుకొని 108 సాయంతో బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు


మొబైల్ షాపులో చోరీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక హిందూపురం రోడ్డు పక్కన ఉన్న సప్తగిరి కాలనీ సమీపంలోని వేణుగోపాల్ మొబైల్ సర్వీస్ షాపులో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు యజమాని వేణు తెలిపారు. వేణు శుక్రవారం రాత్రి 9 గంటల వరకూ మొబైల్ షాప్‌లో పని చేసి, ఆ తర్వాత మూసి వేసి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి దొంగలు షట్టర్ తాళం పగలగొట్టి లోపలికి చొరబడి రూ. 3 లక్షల విలువ చేసే నూతన మొబైల్స్‌తో పాటు సంబంధిత పరికరాలు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

చిలమత్తూరు : మండలంలోని పాలేపల్లి గ్రామ శివారులో శనివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 5,720 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మునీర్ తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

భూఆక్రమణలపై సిపిఎం ఫిర్యాదు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని జెకె పల్లి పొలంలో ఉన్న ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని కోరుతూ శనివారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని ఆ భూమినీ స్వాధీనం చేసుకోవాలని కోరారు. అలాగే ఆ భూమిలో హెచ్చరిక బోర్డులు నాటాలన్నారు. లేనిచో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, నౌషాద్, వెంగమని, రామచంద్ర, రైతు సంఘం నాయకుడు పోతలయ్య, మునాఫ్, చాంద్‌బాషా, వెంకటనారాయణ, ఓబుళపతి, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీకి చెందిన సున్నపుగుట్టతండాలో శనివారం కృష్ణానాయక్ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న డా. బత్తల హరిప్రసాద్ మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ ద్వారా మృతుని కుటుంబానికి రూ. 10వేలు అందజేశారు. కార్యక్రమంలో రాజునాయక్, శ్రీనివాసులునాయక్, సురినేని కిరణ్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని వెలిచల గ్రామ రైతు సేవా కేంద్రంలో శనివారం సమాచార హక్కు చట్టంపై కదిరి వ్యవసాయ సహాయ సంచాలకులు(ఎడిఎ) ఎస్. సత్యనారాయణ అధ్యక్షతన మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎడిఎ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో అడిగిన సమాచారం పూర్తి స్థాయిలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యాలయ ఆవరణలో సమాచారం హక్కు బోర్డు, అధికారుల పేర్లు, హోదా, మొబైల్ నెంబర్ విధిగా ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు వి.లోకేశ్వర్‌రెడ్డి, లక్ష్మీప్రియ, గాండ్లపెంట, ఎన్‌పి కుంట మండలాల్లోని అన్ని గ్రామాల రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎడిఎ సత్యనారాయణ

తెలుగుతమ్ముళ్ల సంక్షేమమే టిడిపి ధ్యేయం

ప్రజాశక్తి-గోరంట్ల

తెలుగుతమ్ముళ్ల సంక్షేమమే టిడిపి ధ్యేయమని ఆ పార్టీ మండల కన్వీనర్లు పేర్కొన్నారు. పట్టణం లోని పార్టీ కార్యాలయంలో శనివారం టిడిపి సభ్యత్వ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల కన్వీనర్ సోమశేఖర్ మాట్లాడుతూ రూ. వంద చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ. 5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఫోన్ ద్వారా కూడా సభ్యత్వం తీసుకోవచ్చన్నారు. టిడిపి శ్రేణులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ఎక్కువ శాతం సభ్యత్వాలు చేయించడానికి కృషి చేయాల న్నారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణచౌదరి, చంద్ర, వేణు రాయల్, సుబ్బారెడ్డి, నరేష్, నిమ్మల శ్రీధర్, రఘునాథ్‌రెడ్డి, డీలర్ అజ్మతుల్లా, రాఘవనాయుడు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

బుక్కపట్నం : కార్యకర్తల సంక్షేమమే టిడిపి ధ్యేయమని మండల కన్వీనర్ మలిరెడ్డి తెలిపారు. బుక్కపట్నంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే టిడిపి ధ్యేయమని, కార్యకర్తల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ సాకే యశోద, గంగాధర్, చెన్నకృష్ణ,వెంకట రాముడు, రామ సుబ్బారెడ్డి, బాలు, వాజిద్, మంజు, సుధీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిగి : మండల వ్యాప్తంగా ముఖ్య నాయకులు టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారం భించారు. అలాగే టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త తప్పకుండా సభ్యత్వం చేయించు కోవాలన్నారు. సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ, లక్ష్మణరావు, సిఆర్.గోవిందరెడ్డి, నాగభూషణం, తిరుమలేష్ పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక టిడిపి కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టగా మంచి స్పందన లభించింది. మండల నాయకులు మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి పేదల పక్షాన నిలబడి వారి సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంద న్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్ధ లింగప్ప, హిందూపూరం పార్లమెంట్ కార్యదర్శి నీరగంటి చంద్ర, తొగటవీర క్షత్రియ సంఘ అధ్యక్షులు సిసి హరి, మండల రైతు సంఘ నాయకులు హరికృష్ణ, రామకృష్ణ, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, టౌన్ అధ్యక్షులు వడ్డే సూరి, శరత్‌చంద్రారెడ్డి, శ్రీరాములు, రమణ, సతీష్, ప్రభాకర్, అన్సర్, శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక శ్రీగంగా భవానీ ఆలయం వద్ద టిడిపి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య తెలిపారు. ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పిరెడ్డి వెంకటరమణారెడ్డి, డి.ఆనంద్, ఎస్‌వి.సికిందర్, రఫిక్, దాసిరెడ్డి, అక్రమ్‌బాషా, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామని మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి చింతలపల్లి మహేష్ చౌదరి తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం ఎన్టీఆర్ టిడిపిని స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిగిచెర్ల ఓబిరెడ్డి, రాఘవరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు



గోరంట్లలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ సోమశేఖర్

నల్లమాడ : మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆధ్వర్యంలో మండ లంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శంకర్, నాయకులు బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కేశవరెడ్డి, మైలే రామచంద్ర, సలాంఖాన్, రమణారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, చంద్ర, కె.బయారెడ్డి, నరసింహులు, అరవింద్‌బాబు, ఎం. రవికుమార్, మణికుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిబండ : గుడిబండలో టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, న్యాయవాది శివకుమార్ ఇంటి ఆవరణలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, నాయకులు లక్ష్మినరసప్ప, భీమరాజు, కెఎన్ పల్లి సురేష్, న్యాయవాది శివకుమార్, సన్నమారెప్ప, జయరామప్ప, పురుషోత్తం, వెంకటేష్, రాజన్న, కరికెర రవిస్వామి, నాగరాజు, వరప్రసాద్, డీలర్లు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలంలోని అలుగుండు పంచాయతీలో మండల కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యం లో టిడిపి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో రామ్మోహన్, నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండలంలోని పెడబల్లి గ్రామంలో మండల కన్వీనర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అలాగే పెడబల్లి పార్టీ కార్యాలయంలో పలువురు సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్‌నాయక్, బ్రహ్మయ్య, నాగరాజు, మురారి, నరసింహులు, జగన్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని మల్లేపల్లి పంచాయతీకి చెందిన ఆకుతోటపల్లిలో టిడిపి నాయకులు ముందుగా గంగమ్మకు పూజలు నిర్వహించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రమేష్, బాబు, ప్రభాకర్‌నాయుడు, మనోహర్, సూరి, కోట్ల బాబి, సూర్యశేఖర్ పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలో శనివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షులు డిఈ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభం అయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ వ్యాప్తంగా టీడీపీ సభ్యత్వం నమోదును వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. లక్ష్యాలను చేరుకోవాలని వార్డు ఇన్‌ఛార్జులకు సూచించారు. సభ్యత్వం తీసుకున్న వారికి ఉచిత బీమా సౌకర్యం ఉంటుందన్నారు.

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ నియామకం


ప్రజాశక్తి-పరిగి

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా పరిగి మండలంలోని బీచిగానిపల్లి గ్రామానికి చెందిన సి.రామాంజినప్ప నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ ఎంప్లాయిమెంట్ అధికారి శివరంగ ప్రసాద్ నియామక పత్రం అందజేశారు. రామాంజినప్ప మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమించినందుకు మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్, డిడి ఎస్సీ వెల్ఫేర్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కొన్నేళ్లుగా బహుజన చైతన్య వేదిక, ఎపి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా అనేక ఉద్యమాల్లో పాల్గొని నా దృష్టికి వచ్చిన ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానన్నారు. ఇకపై మరింత బాధ్యతగా పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ, సానిపల్లె ఈశ్వర్, పలువురు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా సి. రామాంజినప్ప ఎంపికైన సందర్భంగా బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ అభినందనలు తెలిపారు. వెంకటేశులు, బాబు, ఈశ్వర్, గోవిందప్ప, కుమ్మర నాగరాజు, లక్ష్మీనారాయణ, రవికుమార్, ఆంధ్రూస్, ఆటో లక్ష్మినాయక్, పైడేటి రామదాస్, నరేష్ ఆయనకు అభినందనలు తెలిపారు.

కమిటీ మెంబర్‌గా గంగులయ్య

పుట్టపర్తి క్రైమ్ : జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా చెరుకూరి గంగులయ్యను జిల్లా కలెక్టర్ చేతన్ ఎంపిక చేశారు. ఈ మేరకు శనివారం ఎస్సీ, ఎస్టీ పిడి శివరంగ ప్రసాద్ నుంచి గంగులయ్య నియామక పత్రాలు అందుకున్నారు. గంగులయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు సేవ చేసే అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కమిటీలో జిల్లా వ్యాప్తంగా ఏడుగురికి నియామక పత్రాలు అందించారు.



అధికారి శివరంగ ప్రసాద్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న సి.రామాంజినప్ప



అధికారి నుంచి నియామక పత్రం అందుకుంటున్న గంగులయ్య



వైద్య శిబిరంలో చికిత్స చేస్తున్న డాక్టర్

లేపాక్షిలో ఉచిత గుండె వైద్య శిబిరం

లేపాక్షి : స్థానిక ఓరియంటల్ స్కూల్‌లో శనివారం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి ఆకుల ఉమేష్ ఆధ్వర్యంలో అనంతపురం నగరం లోని మార్క్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో దాదాపు 200 మందికి పైగా ప్రజలకు సేవలందించారు. రూ. 4 వేలు ఖర్చయ్యే పరీక్షలను ఉచితంగా చేశారు. చికిత్స అవసరమైన వారికి మార్క్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, జనసేన నేత లోకేష్, హిందూపురం మండల, పట్టణ అధ్యక్షులు చక్రవర్తి, శేఖర్, లేపాక్షి జనసేన నాయకులు నరేష్, మల్లికార్జున, బిజెపి నాయకులు బద్రినాథ్ పాల్గొన్నారు.

వేలం ద్వారా పంచాయతీకి ఆదాయం

చిలమత్తూరు : చిలమత్తూరుచెరువు, మరవకొత్తపల్లి ఈదులవంక చెరువుకు శనివారం వేలం పాట నిర్వహించారు. అందులో చిలమత్తూరు చెరువును రూ. 3,04,000, మరవ కొత్తపల్లి చెరువును రూ. 54 వేలకు పాటదారులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ప్రభుదాస్, పంచాయతీ కార్యదర్శి రామ్లానాయక్, సర్పంచి సంధ్య పాల్గొన్నారు.



పాత్రికేయులకు నిత్యావసర సరుకుల కిట్స్ పంపిణీ చేస్తున్న మంత్రి కార్యాలయ సిబ్బంది

పాత్రికేయులకు దీపావళి కానుక పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

దీపావళి పండుగ పురస్కరించుకొని శనివారం పట్టణంలోని ఎన్డీఎ కార్యాలయంలో ఇన్‌ఛార్జి హరీష్‌బాబు ఆధ్వర్యంలో పాత్రికేయులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. హరీష్‌బాబు మాట్లా డుతూ ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారిదిగా ఉంటూ సమస్యలను పరిష్కరించే దిశగా పాత్రికేయులు కీలక పాత్ర పోషించడం గర్వించదగ్గ విషయమన్నారు. సమాజాన్ని అభివృద్ధి బాటలో నడుపుతున్నారని తెలిపారు. అనంతరం పాత్రికేయులు ప్రెస్‌క్లబ్ తరపున హరీష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్యామ్‌రావు, డోలా రాజారెడ్డి, సాకే ఓబులేసు, జింకా రామాంజనే యులు, పామిశెట్టి శివశంకర్, గుండా పుల్లయ్య, నబిరసూల్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి : సిఐ

ప్రజాశక్తి-కదిరి అర్బన్



బాలికలతో మాట్లాడుతున్న సిఐ మోహన్

విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ చాలా అవసరమని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని అవ్‌గ్రేడ్ స్టేషన్ సిఐ మోహన్ సూచించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఎఫ్ఐఆర్ నమోదుపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా అసాం ఘిక కార్యక్రమాలకు పాల్పడినా, గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం సెట్ కాన్ఫరెన్స్‌లో విద్యార్థులతో మాట్లాడించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండల వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లు ప్రజలకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ షాబుద్దీన్ సూచించారు. డీలర్ల స్కేళ్లను శనివారం తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో పరిశీలించి సీల్ వేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ తూకంలో వ్యత్యాసం రాకూడదన్నారు. తూనికల అధికారి మాట్లాడుతూ ప్రతి డీలర్ స్కేల్‌కు ముద్ర వేయించుకోవాలని, లేనిచో రూ. 25 వేల వరకూ అపరాధ రుసుము చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తూనికలు కొలతల శాఖ అధికారి మహమ్మద్ గౌస్, డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, స్టోర్ డీలర్లు పాల్గొన్నారు.

ఎట్టకేలకు గండి పూడ్చివేత



గండి పూడ్చడంతో చెరువులోకి చేరుతున్న నీరు

చిలమత్తూరు : మండలంలోని పెద్దకాలువకు ఐదు రోజుల క్రితం లాలేపల్లి వద్ద గండి పడిన విశయం తెలిసిందే. దీనిపై ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అప్పటి నుంచి కాలువ గండిని పూడ్చడానికి ఉపాధి, పంచాయతీ సిబ్బంది, టిడిపి తీవ్రంగా శ్రమించి శనివారం ఎట్టకేలకు పూడ్చారు. దీంతో చిలమత్తూరు చెరువుతో పాటు మరవకొత్తపల్లి చెరువులోకి నీరు చేరుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, మాజీ సర్పంచి నందీషప్ప, గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ సోముల ఆధ్వర్యంలో గండిని పూడ్చారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని ఎరువులు, క్రిమి సంహారక మందుల దుకాణాలను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, లైసెన్స్‌లు తదితర వాటిని పరిశీలించారు. నిషేధిత గడ్డి మందు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని దుకాణాల యజమానులను హెచ్చరించారు. ఆయన వెంట ఎడిఎ సత్యనారాయణ, ఏవో శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఎడిఎ సత్యనారాయణ, ఏవో శ్రీనివాసరెడ్డి